క్లుప్తంగా

'ఉపాధి'లో కార్యదర్శి చేతివాటం

ఒకే పనికి రెండు బిల్లులు

సామాజిక తనిఖీలో గ్రామస్తులు ఆగ్రహం

పుల్‌కల్(అందోల్): ఉపాధిహామీ పథకంలో భాగంగా నర్సరీ పెంపకంలో పంచాయతీ కార్యదర్శి చేతివాటం ప్రదర్శించి రూ.20 వేల నిధులను డ్రా చేశారు. మండలంలోని మిన్‌పూర్ గ్రామంలో నర్సరీ పెంపకం పనులు గ్రామ పంచాయతీ సిబ్బందితో చేయించారు. పంచాయతీ కార్యదర్శి గ్రామ పంచాయతీ సిబ్బంది పేర్లను ఉపాధి హామీ పథకంలో చేర్చి హాజరు పట్టిక ప్రకారం నిధులు డ్రా చేశారు. అంతేకాకుండా ఆ సిబ్బందికి నెలనెల జీతాలు కూడా చెల్లించారు. దీంతో రెండు విధాలుగా ప్రభుత్వ నిధులు డ్రా చేశారని గ్రామస్తులు సామాజిక తనిఖీ సమావేశంలో ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో దుర్వినియోగం అయిన నిధులు రికవరీ చేస్తామని సామాజిక తనిఖీ అధికారులు తెలపడంతో గ్రామస్తులు శాంతించారు.

ఫెన్సింగ్, షెడ్డు తొలగింపు



ఫెన్సింగ్ షెడ్డును తొలగిస్తున్న హైడ్రా సిబ్బంది

పటాన్‌చెరు టౌన్: మండలంలోని ముత్తంగి గ్రామపరిధిలో పార్కుస్థలం ఆక్రమించి ఫెన్సింగ్ వేసి, అందులో షెడ్డు నిర్మించారని గాయత్రి అసోసియేషన్ సభ్యులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. దానిపై పూర్తిస్థాయిలో విచారణ జరపగా పార్కుస్థలం, రహదారిని బ్లాక్ చేశారని తేలింది. దీంతో శుక్రవారం హైడ్రా సిబ్బంది షెడ్డు, ఫెన్సింగ్‌ను తొలగించి, నేలమట్టం చేశారు. అయితే, దీనిపై హైడ్రా సీఐ రాజశేఖర్ పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కబ్జాకు పాల్పడిన ప్రవీణ్, రవి, రాజేష్, మీరాజ్‌లపై పోలీసులు కేసు నమోదు చేశారు.

విధి నిర్వహణతోనే గుర్తింపు



సన్మానం చేస్తున్న ఎస్‌ఐ వెంకటేశం

కల్హేర్(నారాయణఖేడ్): అంకితభావంతో పని చేసే ఉద్యోగులకు ఎక్కడైన మంచి గుర్తింపు వస్తుందని కల్హేర్ ఎస్‌ఐ వెంకటేశం తెలిపారు. శుక్రవారం ఎస్‌ఐలు అంజయ్య, శ్రీశైలంకు సన్మానం చేశారు. వీరు హైదరాబాద్‌కు బదిలీపై వెళ్తుండటంతో వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది రవి, నాగప్ప పాల్గొన్నారు.

సీసీరోడ్ల పనుల పరిశీలన



పనులు పరిశీలిస్తున్న మాజీ కౌన్సిలర్లు

నారాయణఖేడ్: మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డుకు సంబంధించిన కాలనీల్లో కొనసాగుతున్న సీసీరోడ్ల నిర్మాణ పనులను శుక్రవారం మున్సిపల్ తాజా మాజీ కౌన్సిలర్లు వివేకానంద్, హన్మాండ్లు, రాజేష్ చౌహాన్ పరిశీలించారు. ఆయా రోడ్ల నిర్మాణంలో నాణ్యతా పాటించాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు సూచించారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

జోగిపేట(అందోల్): అల్మాయిపేటలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని అందోల్ మండల ట్రాన్స్‌కో అధికారి శ్రీనివాస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉ.11 గంటల నుంచి సా.4 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



సదాశివపేట(సంగారెడ్డి): ధూపదీప నైవేద్య అర్చక సంఘం జిల్లా అధ్యక్షుడిగా మడుపతి అడివయ్యస్వామి, కార్యదర్శిగా రాజశేఖర్ శర్మ, కోశాధికారిగా మడుపతి శంభుప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం పట్టణంలో నిర్వహించిన జిల్లా అధ్యక్ష కార్యవర్గ సభ్యుల ఎన్నిక కార్యక్రమానికి రాష్ట్ర అధ్యక్షుడు వాసుదేశ శర్మ హాజరై మాట్లాడారు. జిల్లాలోని ధూపదీప నైవేద్య అర్చకుల సమస్యలను జిల్లా అధ్యక్ష కార్యవర్గ సభ్యులు పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లాలోని దూపదీప నైవేద్య అర్చకులు పాల్గొన్నారు.







జహీరాబాద్ నియోజకవర్గంలోని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు శుక్రవారం మాజీ సీఎం కేసీఆర్‌ను కలిసేందుకు పాదయాత్రగా సిద్దిపేట జిల్లాలోని ఎర్రవల్లి ఫాంహౌజ్ బయలుదేరారు. ఝరాసంగంలోని కేతకీ ఆలయంలో కేసీఆర్ పేరిట ప్రత్యేక పూజలు నిర్వహించి కేసీఆర్‌ను కలిసి ప్రసాదం అందజేశారు. జహీరాబాద్, కోహీర్, ఝరాసంగం, న్యాల్‌కల్, మొగుడంపల్లి మండలాల నుంచి బీఆర్ఎస్ శ్రేణులు భారీ సంఖ్యలో తరలివెళ్లాయి. సుమారు 500 మంది మాజీ సీఎం కేసీఆర్ కలిసి కన్యకా పరమేశ్వరీ చిత్రపటాన్ని అందించి సన్మానించారు. అనంతరం పలు అంశాలపై చర్చించారు. జహీరాబాద్, సంగారెడ్డి, నర్సాపూర్ ఎమ్మెల్యేలు కె.మాణిక్‌రావు, చింతా ప్రభాకర్, సునీతారెడ్డి, మాజీ మంత్రి హరీశ్‌రావు, డీసీఎంఎస్ చైర్మన్ ఎం.శివకుమార్, నామ రవికిరణ్ తదితరులు ఉన్నారు. –జహీరాబాద్

రైతు భరోసాకు 926 దరఖాస్తులు



దరఖాస్తులు స్వీకరిస్తున్న ఏఈఓ లావణ్య

మునిపల్లి(అందోల్): రైతుభరోసా మంజూరుకు 926 మంది దరఖాస్తు చేసుకున్నట్లు వ్యవసాయ విస్తరణ అధికారి లావణ్య తెలిపారు. శుక్రవారం అధికారులు రైతుల నుంచి ఆధార్, బ్యాంకు పాస్ బుక్, పట్టాపాస్‌బుక్, ఫోన్ నంబర్లను సేకరించారు. మండలంలో కొత్తగా పట్టాపాస్‌బుక్‌లు 1562 మందికి వస్తే వారిలో 926 మంది రైతులు మాత్రమే రైతుభరోసా మంజూరుకు దరఖాస్తు చేసుకున్నట్లు మండల వ్యవసాయాధికారి అంజలి తెలిపారు. దరఖాస్తు చేసుకున్న వారికే రైతుభరోసా వస్తుందన్నారు. పాత వారికి యథావిధిగా పడతాయని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారులు స్నేహ, రహిమాన్, అంజన్న, నిఖిత రైతులు పాల్గొన్నారు.

గద్దర్ ఆశయ సాధనకు కృషి



గద్దర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ప్రజా గాయకుడు గద్దర్ ఆశయాల సాధనకు ప్రతిఒక్కరు కృషి చేయాలని గద్దర్ గళం ఫౌండర్ చైర్మన్ కొల్లూరి సత్తయ్య, మాజీ కౌన్సిలర్ భరత్ అన్నారు. శుక్రవారం తెల్లాపూర్‌లో గద్దర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గద్దర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. తెల్లాపూర్ గ్రామానికి గద్దర్‌కు ఎంతో అనుబంధం ఉందన్నారు. ఆయన ఆటాపాటలతో అనేక ఉద్యమాలకు ఊపిరిపోశారని గుర్తు చేశారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలనే లక్ష్యంతో ×గద్దర్ గళం×ను స్థాపించమని తెలిపారు. గద్దర్ సాహిత్యం, ఆటాపాటలు గద్దర్ విగ్రహాల ఏర్పాటును ముందుకు తీసుకెళ్తామని వివరించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం గద్దర్ అవార్డులను ప్రకటించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. గద్దర్ పుస్తకాల ప్రచరణకు ప్రభుత్వం నిధులను కేటాయించడం హర్షదాయకమన్నారు. గద్దర్‌పై బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు కృష్ణ, ప్రభాకర్ రెడ్డి, అరుణ్‌గౌడ్, నర్సింహ, సుధాకర్ రెడ్డి, శ్రీనివాస్, రవి, జనార్దన్ పాల్గొన్నారు.

గడ్డపోతారం మున్సిపాలిటీ సందర్శన



మున్సిపాలిటీ భవనాన్ని పరిశీలిస్తున్న చంద్రశేఖర్

జిన్నారం (పటాన్‌చెరు): నూతనంగా ఏర్పడిన గడ్డపోతారం మున్సిపాలిటీని జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా కమిషనర్ జైత్రంనాయక్‌తో కలిసి మున్సిపాలిటీలో విలీనమైన గ్రామపంచాయతీల కార్యదర్శులు, మున్సిపల్ అధికారులతో సమావేశమయ్యారు. అనంతరం గ్రామపంచాయతీల రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా హెట్రో పరిశ్రమ సౌజన్యంతో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని పరిశీలించారు. మున్సిపాలిటీ కార్యాలయానికి అనుకూలంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు. నిర్మాణ పనులు హెట్రో యాజమాన్యంతో చర్చించి పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జైత్రంనాయక్, వివిధశాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి



ఏఓకు వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

జహీరాబాద్ టౌన్: పెండింగ్ వేతనాలు చెల్లించాలని జహీరాబాద్ మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులు, సీఐటీయూ నాయకులు శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో ఏఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ.. కాంట్రాక్టు కార్మికులకు జీతాలు రాక ఇబ్బందులకు గురవుతున్నారని వాపోయారు. ఫిబ్రవరి నెల వచ్చిన ఇంకా డిసెంబర్ వేతనాలు ఇవ్వలేదని వాపోయారు. జీతాలు రాక కుటుంబాలు గడవడం కష్టం మారిందన్నారు. ప్రతి నెల వేతనాలను ఏస్టీఓ ద్వారా కాకుండా మున్సిపల్ నుంచి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్మిక యూనియన్ నాయకులు యశోదమ్మ, లక్ష్మీ, మోహన్, లక్ష్మణ్‌లు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ విద్యార్థుల సత్తా

జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారం మండలం బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని తెలంగాణ మోడల్ హైస్కూల్ విద్యార్థులు మండల స్థాయి ఫిజికల్ సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో సత్తాచాటారు. పదో తరగతికి చెందిన ముగ్గురు విద్యార్థులు మోహన్ మొదటి బహుమతి, కార్తీక, ఇస్మాయిల్ ద్వితీయ బహుమతి సాధించారు. టాలెంట్ టెస్ట్‌లో మొదటి స్థానంలో నిలిచి జిల్లాస్థాయికి ఎంపికైన విద్యార్థులకు ప్రిన్సిపాల్ శ్రీదేవి అభినందనలు తెలిపారు.

ఉద్యోగుల సదస్సును జయప్రదం చేయండి

హత్నూర (సంగారెడ్డి): మాల ఉద్యోగుల సంఘం జిల్లా సదస్సును జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు బక్కన్న పేర్కొన్నారు. శుక్రవారం హత్నూర మండలం దౌల్తాబాద్‌లో మాలల జిల్లా సదస్సు కరపత్రాలను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో మాలల ఐక్యత, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి మాల ఉద్యోగుల సంఘం కృషి చేస్తుందన్నారు. ఫిబ్రవరి 2న జిల్లా కేంద్రం సంగారెడ్డిలో అంబేడ్కర్ జిల్లా సదస్సు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మాల ఉద్యోగులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షుడు విజయరావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

గంజాయి విక్రేతకు ఐదేళ్ల జైలు

సంగారెడ్డి టౌన్: గంజాయి విక్రేతకు ఐదేళ్ల జైలుశిక్ష విధించిన సంఘటన సంగారెడ్డి జిల్లాలో చోటుచేసుకుంది. ఎక్సైజ్ పోలీసుల కథనం ప్రకారం.. పట్టణానికి చెందిన బిలాల్ 2009లో ఐదు కిలోల గంజాయి అమ్మకం చేసిన కేసులో ఎక్సైజ్ సీఐ మధుబాబు కేసు నమోదు అరెస్టు చేశారు. శుక్రవారం జిల్లా కోర్టులో మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి జయంతి నిందితుడికి ఐదేళ్ల జైలుశిక్ష, రూ.25 వేల జరిమానా విధించారు. సహకరించిన ఎక్సైజ్ అధికారులకు అభినందించారు.

రికార్డు అసిస్టెంట్‌కు సన్మానం



నాగిశెట్టి దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

జహీరాబాద్ టౌన్: మొగుడంపల్లి మండలం ధనసిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రికార్డు అసిస్టెంట్‌గా పనిచేసి పదవి విరమణ పొందిన నాగిశెట్టిని శుక్రవారం ఘనంగా సన్మానించారు. పలువురు ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. నాగిశెట్టి అందరి మన్ననలు పొందారని కొనియాడారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం. రమేష్‌కుమార్, ఉపాధ్యాయులు మల్లయ్యస్వామి, జితేందర్, ధాల్‌సింగ్, చంద్రశేఖర్, పరమేష్, శ్యామ్, మంజుల, మహేష్, సిద్దప్ప, సురేష్‌లు పాల్గొన్నారు.

దేవాలయాల అభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

రామచంద్రాపురం (పటాన్‌చెరు): దేవాలయాలు, ప్రార్థన మందిరాల అభివృద్ధికి తన వంతు సాయం ఎల్లప్పుడు ఉంటుందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. శుక్రవారం తెల్లాపూర్ మున్సిపాలిటీ వెలిమెలలో రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన బీరప్పస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మానసిక ప్రశాంతత కోసం ప్రతి ఒక్కరూ దైవచింతనను పెంపొందించుకోవాలన్నారు. నియోజకవర్గంలో పరమత సహనాన్ని పెంపొందిస్తూ ఆలయాలు, చర్చిలు, మసీదులను నిర్మిస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ రాములు గౌడ్, నాయకులు సోమిరెడ్డి, యాదగిరి యాదవ్, గూడెం మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు.



విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే

మతసామరస్యానికి ప్రతీక పటాన్‌చెరు

పటాన్‌చెరు: మినీ ఇండియాగా పేరొందిన పటాన్‌చెరు మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తోందని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి అన్నారు. పట్టణానికి చెందిన జీఎంఆర్ యువసేన నాయకుడు సోహెల్ బృందం ఆధ్వర్యంలో అజ్మీర్ దర్గా వెళ్తున్న సందర్భంగా ఎమ్మెల్యే ఆధ్వర్యంలో శుక్రవారం చాదర్ కార్యక్రమం నిర్వహించారు.

కార్మికశాఖ కార్యాలయం ఎదుట ఆందోళన



నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ నాయకులు

నారాయణఖేడ్: అర్హులైన కార్మికులు అందరికీ కార్మికశాఖ కార్డులు జారీ చేయాలని సీపీఐ జిల్లా నాయకులు చిరంజీవి డిమాండ్ చేశారు. కార్మికశాఖ సహాయ అధికారి గిరిరాజు తీరును నిరసిస్తూ శుక్రవారం కార్మికశాఖ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. కార్మికశాఖ కార్డు కోసం మీసేవా కేంద్రాల్లో దరఖాస్తులు ఆన్‌లైన్ చేసి అవసరమైన డాక్యుమెంట్లను కార్యాలయానికి తీసుకువచ్చి చూయిస్తే కాళ్లకు మట్టిలేదు, చేతులకు దుమ్ములేదు, తెల్లబట్టలు వేశావు, చెప్పులు మంచివి వేశావంటూ అధికారి హేళన చేస్తూ కార్డు కావాలంటే హైదరాబాదుకు వెళ్లండని బెదిరిస్తున్నాడని ఆరోపించారు. గట్టిగా మాట్లాడితే ఇక్కడి నుంచి కార్యాలయం తీసేస్తామని సిబ్బంది బెదిరిస్తున్నారని మండిపడ్డారు. కలెక్టర్ స్పందించి విచారణ జరిపించి కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. నాయకులు అశోక్ , కార్మికులు విజయ్, నరేష్, యాదగిరి, సాయిలు పాల్గొన్నారు.

టీచర్ ఎమ్మెల్సీగా గెలిపించండి



ఎమ్మెల్సీ అభ్యర్థి అశోక్ కుమార్

పటాన్‌చెరు టౌన్: కరీంనగర్, ఆదిలాబాద్, మెదక్, నిజాంబాద్ నియోజకవర్గ టీచర్ ఎమ్మెల్సీగా టీఎస్‌యూటీఎఫ్ బలపరిచిన ఉపాధ్యాయ ఉద్యమ నేత, టీపీటీఎఫ్ పూర్వ అధ్యక్షుడు అశోక్ కుమార్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి లక్ష్మారెడ్డి కోరారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 36 సంవత్సరాలుగా విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేశారని అన్నారు. అశోక్‌కుమార్‌ను కరీంనగర్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గెలిపించి పెద్దల సభకు పంపిస్తే అన్ని వర్గాల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తాడని తెలిపారు. అభ్యర్థి అశోక్ కుమార్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయ ఉద్యమంలో నిరంతరం ఉన్న నాయకుడిగా నేనున్నానని, ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలు బాగా తెలిసిన వ్యక్తిగా నన్ను బలపరచాలని కోరారు. కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు అశోక్, ప్రధాన కార్యదర్శి సాయిలు, టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సోమశేఖర్, ప్రధాన కార్యదర్శి రామచందర్, నాయకులు పాల్గొన్నారు.

అందరూ కలిసిమెలిసి ఉండాలి

నారాయణఖేడ్: నిజాంపేట్ మండలం బాచేపల్లి గ్రామంలో శనివారం పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్‌ఐ) జాన్సన్ మాట్లాడుతూ.. గ్రామంలో అంటరాని తనం, రెండుగ్లాసుల పద్ధతులు పాటించకూడదన్నారు. కుల మత భేదం లేకుండా అందరం కలసికట్టుగా సోదర భావంతో ఉంటూ గ్రామాభివృద్ధి పాటుపడాలని సూచించారు. వీఆర్‌ఏ సందీప్, సొసైటీ జిల్లా మాజీ డైరెక్టర్ దుర్గారెడ్డి, యువజన కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ పాల్గొన్నారు.

సివిల్ రైట్స్ డే..

కల్హేర్(నారాయణఖేడ్): కుల, మత భేదాలు లేకుండా సమాజంలో అందరూ కలిసి ఉండాలని తహసీల్దార్ శివ శ్రీనివాస్ పేర్కొన్నారు. శుక్రవారం కల్హేర్ మండలం మీర్ఖాన్‌పేట్‌లో సివిల్ రైట్స్ డే నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ మల్లేశం, సిబ్బంది డేవిడ్, కాంగ్రెస్ నాయకులు ఆనందం, మానిక్యాం, జైలు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలకు చెక్

- క్రిటికల్ అనుమతులను జారీ
- 2నెలల్లో పూర్తికానున్న సబ్‌స్టేషన్ నిర్మాణం



సబ్‌స్టేషన్ నిర్మాణానికి ముగ్గుపోస్తున్న సిబ్బంది

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం పట్టణ ప్రజలు అనేక ఏళ్ల విద్యుత్ సమస్యలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సుమారు 20ఏళ్ల క్రితం రామచంద్రాపురానికి అదనపు 33/11కే సబ్‌స్టేషన్ మంజూరు చేశారు. అందుకు సంబంధించిన నిధులు సైతం మంజూరు చేశారు. కాని సబ్‌స్టేషన్‌కు కావాల్సిన స్థలం కేటాయింపు జరగకపోవడంతో నిర్మాణం ముందుకుసాగలేదు. ఈమధ్య కాలనీలు పెరగడంతో పాటు విద్యుత్ వినియోగం పెరగింది. ప్రస్తుత విద్యుత్ స్టేషన్‌పై అధికభారం పడి విలువైన పరికరాలు కాలిపోతున్నాయి. వేసవి కాలంలో పరిస్థితి మరింత దారుణంగా తయారవుతుంది. ఎప్పుడు విద్యుత్ ఉంటుందో.. ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి నెలకొంది. అనేక కాలనివాసులు లోల్టేజ్ సమస్యలతో ఇళ్లలోని ఎలక్ట్రానిక్ పరికరాలు కాలిపోతున్నాయి. ఈ సమస్యలను పరిష్కరించేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు భారతినగర్ డివిజన్ పరిధిలోని బీడీఎల్‌కాలనీ అనుకొని ఉన్న 1500 గజాల స్థలాన్ని గుర్తించారు. అందులో సబ్‌స్టేషన్ నిర్మాణం చేపట్టనున్నారు. విద్యుత్ సమస్యలను గర్తించిన విద్యుత్ శాఖ సీఎండీ క్రిటికల్ అనుమతులను జారీ చేశారు. 33/11కేవి సబ్‌స్టేషన్‌ను సుమారు 42రోజుల్లో పూర్తి చేయనున్నారు. అందుకు రూ.4.50కోట్ల నిధులను మంజూరు చేశారు. వేసవికాలం వచ్చే వరకు విద్యుత్ సమస్యలు లేకుండా చేయాలన్న లక్ష్యంతో విద్యుత్ శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఈ సబ్‌స్టేషన్ నిర్మాణంతో 20ఏళ్ల నుంచి ప్రజలు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలు పరిష్కారంకానున్నాయి.

సంక్షిప్త వార్తలు

◆ ఘనంగా ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన

జహీరాబాద్ టౌన్: మండలంలోని హోతి(కె) గ్రామంలోని తుల్జాభవానీ ఆలయం ప్రాంగణంలో శుక్రవారం నూతన ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయం ప్రాంగణంలో కర్నాటక రాష్ట్రానికి చెందిన పూజారులు వేణుభట్ మహరాజ్ ఆధ్వర్యంలో పూజారులు గణపతి పూజ, హోమం నిర్వహించారు. వేదపండితుల వేద మంత్రోచ్చరణల మధ్య ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. కార్యక్రమంలో శ్రీమంత్‌పూజారి, జనార్దన్, నర్సింహ్మారెడ్డి, శ్రీనివాస్ సుధాకర్ పాల్గొన్నారు.

◆ రత్నప్రభ వాహనంపై శ్రీవారు

సంగారెడ్డి టౌన్ : సంగారెడ్డి పట్టణం కల్వకుంట్ల కాలనీలో శ్రీవేంకటేశ్వర స్వామిని రత్నప్రభ వాహనంపై శుక్రవారం రాత్రి ఊరేగించారు. శ్రీ వైకుంఠపురం దేవాలయ ప్రధాన అర్చకులు వరదాచార్యులు ప్రత్యేక పూజలు చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కల్వకుంటలో ప్రారంభమైన రత్నప్రభ వాహన సేవా శాంతినగర్, కొత్త బస్టాండ్, పాత బస్టాండ్ మీదుగా శ్రీవైకుంఠపురం దేవాలయం వరకు కొనసాగింది. కార్యక్రమంలో భక్తులు, మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

◆ సామూహిక కుంకుమార్చన

నారాయణఖేడ్: వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఖేడ్‌లోని శ్రీషిర్డీ సాయిబాబా ఆలయం ఆవరణలో పట్టణ ఆర్యవైశ్య సంఘం, అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. అమ్మవారికి అలంకరణ, అభిషేకం, ఒడిబియ్యం సమర్పణ, మహాహారతి, మహాప్రసాద వితరణ తదితర కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. సందర్భంగా పురోహితులు మోహన్‌జోష్యి వాసవీ మాత జీవిత చరిత్ర, ఆమె త్యాగనిరతిని వివరించారు. ఆర్యవైశ్య సంఘం మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

◆ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు

జిన్నారం (పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని బీరప్ప బస్తీలో హజ్రత్ మైభు సుభాని దర్గా కమిటీ ఆధ్వర్యంలో సలానా ఉర్స్ షరీఫ్ ఉత్సవాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో జిన్నారం మాజీ ఎంపీపీ కొలన్ రవీందర్ రెడ్డి, ఆనంద్ కృష్ణారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం దర్గాలో మైనారిటీ పెద్దలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఎస్.కె కాసిం, ఇమ్రాన్, రవు, సాను, ఆకు, యూనస్, పాషా, హైమద్, శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

◆ మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ అండ్ డ్రైవ్ లో పట్టుపడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ కథనం ప్రకారం.. గురువారం నిర్వహించిన తనిఖీల్లో 13 మందిని అదుపులోని తీసుకున్నట్లు చెప్పారు. వారిని సంగారెడ్డి కోర్టులో హాజరుపరచగా 8 మందికి రూ.2 వేలు, ముగ్గురికి రూ.1500, మరో ఇద్దరికి రూ.1000, జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

◆ యువకుడి అదృశ్యం

పటాన్‌చెరు టౌన్: ఓ యువకుడి అదృశ్యమైన ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ కోటేశ్వరరావు కథనం ప్రకారం.. మండలంలోని ఇంద్రేశం గ్రామానికి చెందిన శ్రీకాంత్ బీఫార్మసీ పూర్తి చేసి హోమ్ ట్యూటర్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 27 నుంచి కనిపించడం లేదు. దీంతో శ్రీకాంత్ సోదరుడు అశోక్ తెలిసిన వారి వద్ద, స్థానికంగా వెతికిన ఆచూకీ లభించలేదు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

◆ మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్‌కు సత్కారం

నారాయణఖేడ్: హైదరాబాద్‌లోని రాష్ట్ర బీఆర్ఎస్ కార్యాలయంలో శుక్రవారం మున్సిపల్స్ చైర్మన్, వైస్ చైర్మన్ల ఆత్మీయ సత్కారం కార్యక్రమం నిర్వహించారు. ఖేడ్ మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ రుబీనా, నజీబ్ దంపతులను మాజీ మంత్రులు కేటీఆర్, యూసుఫ్‌అలీ శాలువాలతో సన్మానించి జ్ఞాపికను అందజేశారు. పలువురు మాజీ మంత్రులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.